క్లుప్తంగా

ఎర్రగుంట్లకు చేరుకున్న నోటు పుస్తకాలు

ఎర్రగుంట్ల : 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎర్రగుంట్ల మండలానికి 22,030 నాలుగు రకాల నోటు పుస్తకాలు వచ్చాయని మండల విద్యాధికారులు శివప్రసాద్, వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 2,107 మంది విద్యార్థులకు గాను 22,030 నోటు పుస్తకాలు వచ్చాయని వాటిని స్థానిక ఎంఈఓ కార్యాలయంలో బద్రపరిచామన్నారు. వీటిని తర్వలోనే ఆయా పాఠశాలకు పంపిణీ చేస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వేంపల్లె : పట్టణ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ జేఈ శివదినేష్‌కుమార్ వెల్లడించారు. రాజారెడ్డినగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీరామనగర్ ఫీడర్లలో మరమ్మతుల కారణంగా రాజీవ్‌నగర్ కాలనీ, ఎన్టీఆర్ సర్కిల్, ఎస్ఎన్ఆర్ కల్యాణ మండపం, ఏపీ గురుకుల పాఠశాల, అగ్నిమాపక కేంద్రం, తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్‌శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయం విజ్ఞాన సోపానం

ఎర్రగుంట్ల : గ్రంథాలయం విజ్ఞాన సోపానం అని గ్రంథాలయ అధికారి ఎన్.ఉమాదేవి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆమె విద్యార్థులకు డ్రాయింగ్‌పై శిక్షణ అందించారు.

బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించాలి


నందిమండలంలో వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

పెండ్లిమర్రి : గ్రామాల్లో ప్రజలకు బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించి వ్యాక్సినేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా వైద్యాధికారి నాగరాజు తెలిపారు. మండలంలోని నందిమండలం–1 సచివాలయం పరిధిలో గురువారం వేస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికి ఈవ్యాక్సిన్ వేయాలన్నారు. వ్యాక్సిన్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దీని వల్లన టీబీ వ్యాధిని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి వినయ్‌కుమార్‌రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ రామప్రతాప్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

విత్తన నమోదు కార్యక్రమం ప్రారంభం


విత్తన నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

వీరపునాయునిపల్లె : ప్రభుత్వం 40 శాతం రాయితీతో అందిస్తున్న వేరుశనగ విత్తన నమోదు కార్యక్రమాన్ని మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాల్లో గురువారం వ్యవసాయ శాఖ అధికారులు ప్రారంభించారు. విత్తన నమోదు కార్యక్రమాన్ని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి ఎస్.పాలగిరి గ్రామంలో ప్రారంభించారు. వేరుశనగ పంట సాగు చేయు ప్రతి రైతుకు విత్తనాన్ని అందిస్తామన్నారు. రైతు తమ పట్టాదారు పాసుపుస్తకంతో పాటు ఆధార్‌కార్డు, మొబైల్ ఫోన్ తమ వెంట తీసుకుని రైతు భరోసా కేంద్రానికి వెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జాబ్ అచీవర్స్ డే


నియామక పత్రాలు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ తాతాజీ

సింహాద్రిపురం : మండలంలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో గురువారం ఘనంగా జాబ్ అచీవర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కంపెనీలలో ఉద్యోగాలు సాధించిన 16 మంది విద్యార్థినీ, విద్యార్థులకు నియామక పత్రాలు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ తెలిపారు. 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించి పాలిటెక్నిక్ విద్యను అభ్యసించడం ద్వారా చిన్నవయసులోనే పేరున్న కంపెనీలలో ఉపాధి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. తమ కళాశాలలో చదివే విద్యార్థినీ విద్యార్థులకు హాస్టల్ సదుపాయం కలదన్నారు. అలాగే 6 నెలల పారిశ్రామిక శిక్షణ సమయంలో నెలకు రూ.15 వేల నుంచి రూ.18వేల వరకు ఉపకార వేతనం అందిస్తారన్నారు. విద్యార్థులు చదువుపట్ల, ఉద్యోగ అవకాశాల పట్ల కమిషనర్ నాగరాణి (ఐఏఎస్) అందించిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో అన్ని బ్రాంచ్‌ల విభాగాధిపతులు, టీపీఓలు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి


పాల్గొన్న అధికారులు

కమలాపురం : నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని డ్వామా పీడీ, నియోజకవర్గ స్పెషలాఫీసర్ యదుభూషణ్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవీంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో గురువారం నియోజవర్గంలోని వివిధ శాఖల అధికారులతో వారు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో కొన్ని రోజులుగా అభివృద్ధి పనుల్లో కొంత వరకు వేగం తగ్గిందన్నారు. ప్రతి అధికారి భాధ్యతగా పనిచేసి తమ పరిధిలోని అభివృద్ధి పనుల వేగవంతానికి కృషి చేయాలన్నారు. వివిధ పనులకు సంబంధించి ప్రభుత్వం బిల్లులను కూడా మంజూరు చేసిందని, మిగిలి వున్న పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. నాడు–నేడు పనులను వెంటనే పూర్తి చేసి పాఠశాలలు తెరిచే నాటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పాఠశాలలు తెరిచే నాటికి ప్రతి విద్యార్థికి పుస్తకాలతో పాటుగా యూనిఫాం అందించడానికి చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. స్పందన అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కమలాపురం, చెన్నూరు, చింతకొమ్మదిన్నె మండలాల్లో జగనన్న ఇళ్ల నిర్మాణాలు వెనుకబడి వున్నాయని, ఆయా మండలాల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వంద శాతం నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, నియోజవర్గంలోని ఆరు మండలాలకు చెందిన మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

27 నుంచి సెంట్రల్ బోలేవార్డులో వన్‌వే ట్రాఫిక్


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ రమణారెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని సత్రంబడి పాఠశాల నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ బోలేవార్డులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఈనెల 27వ తేదీ నుంచి వన్ వే ట్రాఫిక్ నిబంధనలు విధిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ట్రాఫిక్ సీఐ సురేష్‌రెడ్డి సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పూలఅంగళ్ల సర్కిల్ నుంచి వైఎస్సార్ జంక్షన్ వరకు ఏకమార్గం (వన్‌వే) నిబంధనలు అమలు చేయనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ జంక్షన్ నుంచి సెంట్రల్ బోలేవార్డు మీదుగా పూలఅంగళ్ల వరకు ఏ వాహనం అనుమతి లేదన్నారు. ఫుట్‌పాత్‌పై ఉన్న తాత్కాలిక ఆక్రమణలు, దుకాణాల షెడ్లను స్వచ్ఛందంగా యజమానులు తొలగించుకోవాలన్నారు. నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే వాహనాల పార్కింగ్ చేయాలన్నారు. వ్యాపారులు ఏదైనా వాణిజ్య సరుకు రవాణా వాహనాల నుంచి అన్‌లోడింగ్‌ను రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటలలోపు చేసుకోవాలన్నారు. ఆక్రమణల తొలగింపు, వాహనాల పార్కింగ్ క్రమబద్ధీకరణ కొరకు సచివాలయ సిబ్బంది, పోలీసు వారి బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పట్టణ ప్రజలు, వ్యాపారులు, వాహనచోదకులు ఈ విషయాన్ని గ్రహించి సెంట్రల్ బోలేవార్డు సుందరీకరణకు తోడ్పాటు అందించాలన్నారు. అలా కాకుండా పై సూచనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం రామకృష్ణ, టౌన్ ప్లానింగ్ అధికారి, డీఈ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సూర్యప్రభ వాహనసేవ


సూర్యప్రభ వాహనంపై శ్రీలక్ష్మీనరసింహస్వామి

పెండ్లిమర్రి : మండలంలోని చిన్నదాసరిపల్లె గ్రామ సమీపంలోని వెయ్యినూతల కోన క్షేత్రంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నరసింహస్వామి సూర్యప్రభ వాహన సేవలో కొలువై భక్తులకు దర్శనమించారు. ఉదయం స్వామివారికి వేదపండితుల ఆధ్వర్యంలో శాంతి హోమం, సూర్యప్రభ వాహన సేవ, శ్రీచక్ర పెరుమాళ్ సేవ, ఊంజల్ సేవ, రాత్రి గరుడ సేవ వంటి కార్యాక్రమాలు నిర్వహించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహహరిప్రసాద్ పర్యవేక్షించారు.

నేడు స్వామివారి కల్యాణం, చక్రస్నానం

శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరి రోజు శుక్రవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీదేవి అమ్మవారికి ఉదయం 9 గంటలకు వైభవంగా కల్యాణం, మధ్యాహ్నం చక్రస్నానం, గజవాహన సేవ, సాయంత్రం ధ్వజఅవరోహణం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఘనంగా వైఎస్ రాజారెడ్డి వర్ధంతి


వైఎస్ రాజారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్ : మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి తండ్రి కీ.శే. వైఎస్ రాజారెడ్డి 26వ వర్ధంతి వేడుకలను పులివెందుల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పాత ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో వైఎస్ రాజారెడ్డి చిత్రపటానికి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, సివిల్‌సప్లై డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, రాష్ట్ర నూరుబాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్, మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్పలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పులివెందుల పంచాయతీని ఎంతో అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ హాఫీజ్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పార్నపల్లి కిషోర్, సోపాల వీరా, సిద్ధయ్య, బ్యాటరీ ప్రసాద్, రత్నం, రాజు, చంద్రమౌళి, రంగాపురం మధు, కౌన్సిలర్ ప్రసన్న లక్ష్మి, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

400 క్వింటాళ్ల వేరుశనగ కాయలు మంజూరు

లింగాల : మండలానికి ఖరీఫ్ సీజన్‌లో పంట సాగు చేసుకునేందుకు 40 శాతం సబ్సిడీతో 400 క్వింటాళ్ల వేరుశనగ కాయలు మంజూరయ్యాయని ఏఓ రమేష్ తెలిపారు. విత్తన నమోదు ప్రక్రియను ప్రారంభించామని, కావాల్సిన రైతులు వారి పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్‌ను రైతు భరోసా కేంద్రానికి తీసుకువచ్చి వారి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. వేరుశనగకాయలు కె6 రకం అందిస్తున్నామని, క్వింటా పూర్తి ధర రూ.9500 కాగా 40 శాతం రాయితీతో రూ.3800 లకు అందిస్తున్నామన్నారు. ఎకరా విస్తీర్ణంకు 30 కిలోల చొప్పున 30 కేజీల సంచులను ఒక్కొక్క రైతుకు మూడు బ్యాగులు అందిస్తామన్నారు. ఒక ఎకరా విస్తీర్ణం ఉన్న రైతులకు 30 కేజీల బ్యాగును మాత్రమే అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. అదేవిధంగా పెద్దకుడాలలో విత్తన నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు.

అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ విజయవంతం చేయండి


వ్యాక్సిన్ వేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

వేంపల్లె : అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు ఆదేశించారు. గురువారం మండలంలోని అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. అనంతరం వైద్య ఆరోగ్య సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు చేశారు. 18–60 ఏళ్లు పైబడిన వారికి, గత ఐదేళ్ల నుంచి క్షయవ్యాధికి సంబంధించి చికిత్స పొందిన వారికి, వారి కుటుంబ సభ్యులకు, మధుమేహం ఉన్న వారికి, ప్రత్యేకించి మద్యపానం, ధూమపానం సేవించే వారికి, అలాగే బీఎంఐ 18కి తగ్గిన వారికి అవగాహన కల్పిస్తూ బీసీజీ వ్యాక్సిన్ వేయాల్సిందిగా సూచించారు. ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని, వైద్యుల సూచనల మేరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు స్వాతిసాయి, ఖాజామొద్దీన్, కేఎస్‌వీ ప్రసాద్, సీహెచ్ఓ వెంకటరత్నం, సూపర్‌వైజర్లు ఫకృద్దీన్, అరుణాదేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవికి ఘనంగా పౌర్ణమి పూజలు


ప్రత్యేక అలంకరణలో శ్రీ చౌడేశ్వరీ మాత


పూజల్లో పాల్గొన్న మహిళలు

వల్లూరు : మండల పరిధిలోని దుగ్గాయపల్లెలో వెలసిన శ్రీ చౌడేశ్వరీ మాత ఆలయంలో మొలకల పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారి మూలమూర్తితో బాటు ఉత్సవ మూర్తికి అభిషేకాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి మహిళలు అమ్మవారికి పూలు, నిమ్మకాయలు సమర్పించి అమ్మవారి ఎదుట దీపాలను వెలిగించి దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా మొలకల పౌర్ణమి వేడుకలు


మొలక కుంపట్లను ఎత్తుకుని ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు


సింహాద్రిపురంలో మొలకల కుంపట్లతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

లింగాల : మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో మొలకల పౌర్ణమిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో, చావిళ్లలో పోసిన మొలక కుంపట్లను మహిళలు ఎత్తుకుని గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మహిళలు గౌరమ్మ పాటలు పాడుకుంటూ కుంపట్లను ఊరేగింపు నిర్వహిస్తు గ్రామాల్లోని ఊరుబావుల వద్దకు చేరుకుని అక్కడ కుంపట్లను నెలకొల్పారు. అనంతరం రాత్రి 9 గంటల ప్రాంతంలో గౌరమ్మ కుంపటిని ఏర్పాటు చేసి మహిళలు గౌరమ్మ పాటలు పాడుతూ గౌరమ్మ కుంపటిని ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా ఘనంగా మొలకల పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఈ మొలకల పౌర్ణమి గడచిన అమావాస్య రోజు మహిళలు సేకరించిన నవధాన్యాలను కుంపట్లలో వేసి పౌర్ణమి వరకు పూజలు నిర్వహించారు. నవధాన్యాలలో ఏ ధాన్యం బాగా ఏపుగా పెరుగుతుందో ఆ ధాన్యపు పంట బాగా పండుతుందని ఇక్కడి ప్రజల నమ్మకం.

ఆ నమ్మకంతోనే ఆ పంటలను రైతులు సాగుచేస్తారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఈ ఆచారం ప్రకారం ఇప్పటికీ మొలకల పౌర్ణమి నిర్వహిస్తున్నారు. గురువారం మొలకల కుంపట్లను మేళతాళాల నడుమ భక్తిశ్రద్ధలతో మహిళలు వీధులలో ఊరేగింపుగా వెళ్లి ఆ కుంపట్లను దేవాలయాల వద్ద నెలకొల్పుతారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

25న గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు కౌన్సిలింగ్

కమలాపురం : పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికా విద్యాలయంలో 5వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ఈనెల 25వ తేదీన కౌన్సిలింగ్ జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపాల్ తులశమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో మిగిలిన సీట్ల భర్తీకి గానూ 25వ తేదీ ఉదయం 9 గంటలకు లక్కిరెడ్డిపల్లెలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జరిగే కౌన్సిలింగ్‌కు ఆసక్తి కలిగి అర్హత గల విద్యార్థులు హాజరు కావాలని తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశాల కోసం కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో పాటు నాలుగో తరగతి స్టడీ సర్టిఫికెట్, ఇంటర్ ప్రవేశం కోసం ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, స్టడీ సర్టిఫికెట్‌తో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు.

వైభవంగా గంధోత్సవం


గురువుల మజార్ వద్ద ఫాతెహా నిర్వహిస్తున్న దృశ్యం

కమలాపురం : పట్టణంలో వెలసిన హజరత్ షావలి మస్తాన్ వలీ సాహెబ్ గంధోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా ఏ గఫారియా పీఠాధిపతి ఫైజుల్ గప్పార్ షా ఖాద్రి చేతుల మీదుగా స్వామి వారి మజార్‌పై గంధాన్ని సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు, ఫాతెహా చేసి ప్రసాదాన్ని భక్తులకు పంచి పెట్టారు.

ఘనంగా వరదరాజులస్వామి కల్యాణం

లింగాల : మండలంలోని వెలిదండ్ల సమీపం దేవర కోనలో వెలసిన వరదరాజులస్వామి ఆలయంలో భూదేవి, శ్రీదేవి సమేత వరదరాజులస్వామి కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ప్రతీ ఏటా మొలకల పౌర్ణమి సందర్భంగా స్వామి వారి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా సాగుతోంది. ఉదయాన్నే గ్రామంలోని రామాలయం నుంచి స్వామివారి ఉత్సవ మూర్తులను, పట్టువస్త్రాలను డప్పులు, మేళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి వరదరాజులస్వామి ఆలయంలో కల్యాణోత్సం నిర్వహించారు. వెలిదండ్ల, కర్ణపాపయ్యపల్లె, తాతిరెడ్డిపల్లె, దంతలపల్లి, బిదినంచెర్ల, తదితర గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు స్వామి కల్యాణాన్ని కన్నులారా గాంచి తీర్థప్రసాదాలను అందుకున్నారు.

వైభవంగా బుద్ధ పౌర్ణమి వేడుకలు


ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

వీరపునాయునిపల్లె : మండలంలోని ఎస్.పాలగిరి క్రాస్ వద్ద వెలసిన కాశిరెడ్డినాయన, సాయిబాబా ఆలయం, సంగాలపల్లె గ్రామంలోని గో సంరక్షణ శాల, పాయసంపల్లె, గంగిరెడ్డిపల్లె, పోచంరెడ్డిపల్లె గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురువారం బుద్ధ పౌర్ణమి వేడుకలు వైభవంగా సాగాయి. ఉదయం నుంచే వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి సాయిబాబా ఆలయం, కాశిరెడ్డినాయన ఆలయంలోని మూల మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిపించారు. అలాగే సంగాలపల్లె గోశాలలోని గోమాతలకు ప్రత్యేక పూజలు చేపట్టారు. గోశాల ప్రాంగణంలోని కృష్ణాలయంలో భగవద్గీత పారాయణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు కాశిరెడ్డినాయన ఆలయంలో జమ్మలమడుగు పట్టణానికి చెందిన ఎస్.వెంకటకిషోర్‌శెట్టి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గోశాలలో నిర్వాహకులు కల్లూరు రాజశేఖర్‌రెడ్డి దంపతులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రామాపురం క్షేత్రంలో ఘనంగా బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో మోక్షనారాయణస్వామి



స్వామివారిని దర్శించుకుంటున్న ఏపీఎస్ ఆర్‌టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

కమలాపురం : మండల పరిధిలోని శ్రీరామాపురం పుణ్యక్షేత్రంలో శ్రీ మహాలక్ష్మీ సమేత మోక్ష నారాయణస్వామి, శ్రీ వల్లీ దేవసేన సమేత షణ్ముఖ సుబ్రమణ్యస్వామి, సంజీవిని సహిత శ్రీ వీరాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు ఆలయ వ్యవస్థాపకులు సత్య సాయినాథ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. మూడవ రోజైన గురువారం అశ్వ వాహనంపై కొలువుదీరిన మోక్షనారాయణస్వామి ఊరేగింపు ఘనంగా జరిగింది. ఆలయ మాడ వీధుల్లో మేళతాళాలతో, భాజా భజంత్రీలతో స్వామివారి ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం గజ వాహనంపై కొలువుదీరిన శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఏపీఎస్ ఆర్‌టీసీ చైర్మన్

రామాపురం పుణ్యక్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఏపీఎస్ ఆర్‌టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు. స్వామి వార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలను అందచేశారు. పలువురు వైఎస్ఆర్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

కాశిరెడ్డినాయన ఆరాధన మహోత్సవం


హనుమనుగుత్తిలోని శ్రీశ్రీశ్రీ కాశిరెడ్డి నాయన


అలరించిన కోలాట బృందం

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని మాలెపాడు, హనుమనుగుత్తి, గ్రామాలలోని శ్రీశ్రీశ్రీ కాశిరెడ్డి నా యన ఆలయంలో 20వ ఆరాధన మహోత్సవం ఘనంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త మందాల వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులందరికి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద్బంగా సురేష్‌కొండయ్య మాస్టర్స్ ఆధ్వర్యంలో కోలాట బృందం జరిగింది.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


లింగాల పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ వినోద్‌కుమార్

లింగాల : మండలంలోని అన్ని గ్రామాల రౌడీషీటర్లకు లింగాల పోలీస్‌స్టేషన్‌లో గురువారం డీఎస్పీ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి సమస్యలు సృష్టించకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎవరైనా చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ కృష్ణయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లింగాలలో నాకాబందీ..

లింగాల : మండలంలోని అంబకపల్లె గ్రామంలో గురువారం తెల్లవారుజామున లింగాల పోలీసులు ఎస్పీ ఆదేశాల మేరకు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణయ్య గ్రామంలోని ఫ్యాక్షన్ నాయకులు వారి వర్గీయులకు హెచ్చరికలు జారీ చేశారు. జరగబోయే ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎవరు అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకూడదని పోలీసులకు సహకరించాలని తెలిపారు. ఎవరైనా చట్టవ్యతిరేకంగా ప్రవర్తిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : జూన్ 4న జరగబోయే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి ఘర్షణలకు పాల్పడవద్దని చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్ నాయక్ తెలిపారు. గురువారం మండలంలోని మామిళ్లపల్లి, ఇందిరానగర్, నాయనవారిపల్లి, బలిజపల్లి గ్రామాలలో నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఆయన ప్రజలతో మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ పూర్తి అయిన రెండు రోజులపాటు కోడ్ అమలులోనే ఉంటుందని ఎన్నికలకు సంబంధించి ఎలాంటి బాణాసంచా కానీ, విజయోత్సవ ర్యాలీలు కానీ నిర్వహించేందుకు వీలు లేదన్నారు. ఎక్కడైనా ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీకేదిన్నె పోలీసులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోతులూరయ్యస్వామి ఊరేగింపు


జాతర జరిగే ఆలయం

చెన్నూరు : స్థానికంగా వెలసిన ఎల్లమాంబ జాతర ఈనెల 26వ తేదీన ఆదివారం నిర్వహించేందుకు కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎల్లమ్మతల్లి సోదరుడైన పోతులూరయ్యస్వామి ఈనెల 24వ తేదీ శుక్రవారం నుంచి మూడు రోజులపాటు చెన్నూరులో ఊరేగింపుగా ఇంటింటికి వెళ్లి బియ్యం, బేడలు, పసుపు కుంకుమ సేకరిస్తారు. సేకరించిన పసుపు కుంకుమలను మూడవరోజు ఆదివారం సాయంత్రం చెన్నూరు పోలయ్యగారివీధి నుంచి పోతులూరయ్యస్వామిని రెడ్డివీధి, బ్రాహ్మణ వీధి, పార్కువీధి, పాతబస్టాండు, మెయిన్ రోడ్డు మీదుగా ఎల్లమ్మ ఆలయం వరకు ఊరేగింపు నిర్వహిస్తారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు, విజిలెన్స్, సివిల్ ఇతర పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.